క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



శశికిరణ్‌కు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక దరి పెదగంట్యాడకు చెందిన వై.శశికిరణ్ రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు పీఆర్వో కార్యాలయం సూపరింటెండెంట్ ప్రసన్నలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

సీతమ్మధార రైతుబజార్‌ను సందర్శించిన సీఈవో



స్టాళ్ల వద్ద పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీలత

తాటిచెట్లపాలెం: సీతమ్మధార రైతుబజార్‌ను గురువారం మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీలత సందర్శించారు. రైతుబజార్లకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న కర్నూలు ఉల్లిపాయల స్టాళ్ల వద్దకు వెళ్లి వాటి నాణ్యత, ధరలను ఆమె పరిశీలించారు. బజార్‌లోని రైతులు, వినియోగదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సీఈవో వెంట రైతుబజార్ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కిరణ్, మార్కెట్ కమిటీ సెక్రటరీ రవికుమార్, రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ ఉన్నారు.

బాలబాలికలతో కలిసి ప్రో కబడ్డీ వీక్షించిన సీపీ



ప్రో కబడ్డీ మ్యాచ్ వీక్షిస్తున్న స్వచ్ఛంద సంస్థల బాలబాలికలతో సీపీ బాగ్చి

అల్లిపురం: పోర్టు ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన ప్రో కబడ్డీ మ్యాచ్‌ను 24 మంది స్వచ్ఛంద సంస్థల బాలబాలికలతో కలిసి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వీక్షించారు. స్వచ్ఛంద సంస్థల్లో ఉంటున్న బాలబాలికలకు ప్రో కబడ్డీని వీక్షించే అవకాశం కల్పించాలని ఆయన పాపా హోం విద్యార్థులతో కలిసి వారికి పాస్‌లు ఏర్పాటు చేశారు. చిన్నారులతో కలిసి సీపీ మ్యాచ్‌ను వీక్షిస్తూ ముచ్చటించారు. ఇటువంటి అరుదైన అవకాశం కల్పించిన పోలీస్ కమిషనర్‌కు బాలబాలికలు ధన్యవాదాలు తెలియజేశారు. ఆయనతో కలిసి ఫొటోలు దిగుతూ సందడిగా గడిపారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: యుక్త వయసులో మత్తు పదార్థాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపారు. పెందుర్తి పాతూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం-అనర్థాలు, మహిళల భద్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ర్యాగింగ్ అనే విష సంస్కృతికి ప్రతి ఒక్కరూ చరమగీతం పాడాలని సూచించారు. విద్యార్థులు పరస్పర స్నేహభావంతో మెలగాలన్నారు. మత్తు పదార్థాల వలన జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. యుక్త వయసులో చిన్నచిన్న సరదాల కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. విద్యార్థినులు, మహిళా సిబ్బంది ఎలాంటి వేధింపులకు గురైనా తక్షణమే ఉపాధ్యాయులకు, పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లా.. డంపింగ్ యార్డులా..?

- మద్రిపాలెం వుడా లేఅవుట్‌లో కానరాని స్వచ్ఛత
- ఖాళీ ప్రదేశాల్లో గుట్టలుగా డెబ్రిస్, పక్కనే చెత్త
- కొత్త పోలీస్ క్వార్టర్స్ నుంచి ఇటీవల తొలగించిన క్వార్టర్స్ మధ్య మరింత అధ్వానం
- పాములు, విషపురుగుల సంచారం



తొలగించిన పోలీస్ క్వార్టర్స్ వద్ద వ్యర్థాల కుప్పలు, పిచ్చిమొక్కలు, పక్కనే హెచ్చరిక బోర్డు



ఇదే ప్రాంతంలో మరో చోట గృహనిర్మాణ వ్యర్థాలతో పాటు చెత్త

గోపాలపట్నం: స్వచ్ఛతకు, ప్రశాంతతకు మారుపేరులా ఉండే మద్రిపాలెం వుడా లేఅవుట్‌లో పరిస్థితి మారిపోయింది. స్వచ్ఛత కనుమరుగైంది. కాలనీని ఆనుకున్న ఖాళీ ప్రదేశాలు డంపింగ్ యార్డులా మారాయి. పరిసర ప్రాంతాల వారు వేస్తున్న చెత్తతో పాటు గృహ నిర్మాణ వ్యర్థాలను కూడా ఇక్కడే వేయడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. కొత్త పోలీస్ క్వార్టర్స్ నుంచి పాత (తొలగించిన) క్వార్టర్స్ మధ్యలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

పోలీస్ క్వార్టర్స్ వద్దే ఎక్కువగా ..

శిథిలమైన పోలీస్ క్వార్టర్స్‌ను ఇటీవల తొలగించారు. ఆ ప్రాంతంలో కొత్త క్వార్టర్స్ నిర్మించకపోవడంతో ఆ స్థలం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇక్కడ పలువురు మద్యం, గంజాయి సేవిస్తున్నారు. పోలీసు అధికారులు క్వార్టర్ల పునర్నిర్మాణం గురించి పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతం పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో ప్రమాదకరంగా తయారైందని పలువురు వాపోతున్నారు. తేళ్లు, జెర్రిలతో పాటు పాముల బెడద కూడా ఎక్కువగా ఉందని తెలిపారు.

పట్టించుకోని అధికారులు

పారిశుధ్య నిర్వహణపై శానిటరీ అధికారుల పర్యవేక్షణ కరువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గృహ నిర్మాణ వ్యర్థాలను జీవీఎంసీ సూచించిన ప్రాంతాల్లో మాత్రమే వేయాలి. ఎక్కడ పడితే అక్కడ వేయకూడదు. కానీ, వీరు అధికారులతో లోపాయికార ఒప్పందాలతో యథేచ్ఛగా వేసేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కొత్త పోలీస్ క్వార్టర్స్ వద్ద వేసిన వ్యర్థాలు

అగ్నిప్రమాద బాధితురాలికి వైఎస్సార్‌సీపీ చేయూత



బాధితురాలికి ఆర్థికసాయం అందజేస్తున్న మహిళా నాయకులు

సింధియా: అగ్నిప్రమాద బాధితురాలికి స్థానిక వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు చేయూతనందించారు. జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో గత ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కామధేను వరలక్ష్మి అనే మహిళకు చెందిన పాన్‌షాప్ దగ్ధమైంది. ఆస్తినష్టం జరగడంతో బాధితురాలికి స్థానిక వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు రూ.ఐదు వేల ఆర్థిక సాయాన్ని కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు భారతి, మసేనమ్మ, కమల, సువర్ణ, పార్టీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, భాస్కర్, గోపాల్, ఎన్టీఆర్ కాలనీ గ్రామాభివృద్ధి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను పరిష్కరించారు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను అధికారులు పరిష్కరించారు. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ దిగువ గల జంక్షన్ బాక్స్ విద్యుత్ కేబుల్ వైర్లు ప్రమాదకరంగా ఉండడంతో స్థానికులు శ్రీహరిపురం విద్యుత్ ఉపకేంద్రం ఏఈ కె.పావనికి గురువారం వినతిపత్రం ఇచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఆమె ఆ ప్రాంతానికి సిబ్బందిని పంపి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ కేబుల్‌ను తొలగించి, దాని స్థానంలో కొత్త కేబుల్ వైర్‌ను అమర్చారు. దీంతో స్థానికులు ఏఈ పావనికి కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో పారిశుధ్యం మెరుగుకు కృషి

- ఉదయం 6 నుంచే అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండాలి
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- జోన్-3, 4ల్లో క్షేత్ర పర్యటన



రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డును ఆక్రమించిన కూరగాయల దుకాణాన్ని తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: ప్రజారోగ్యం దృష్ట్యా నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జోన్-3, 4 జోనల్ కార్యాలయ పరిధిలోని 19, 20, 30 వార్డుల్లో ఆయన పర్యటించారు. ముందుగా జోన్-4 పరిధి 30వ వార్డు జగదాంబ జంక్షన్, లేపాక్షి జంక్షన్, పూర్ణా మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, పారిశుధ్య కార్మికుల హాజరును ఫోన్‌లో పరిశీలించారు. వ్యర్థాలు చాలా చోట్ల కనిపిస్తున్నాయని, విధుల్లో అలసత్వం వహించరాదని వారికి సూచించారు. ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది ఉదయం 6 గంటల నుంచే విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని అన్ని జోన్ల కమిషనర్లను వాకీటాకీ ద్వారా ఆదేశించారు. పలువురు పారిశుధ్య కార్మికులను వారి విధులు, హాజరును అడిగి తెలుసుకున్నారు.

వ్యాపారులకు వెండింగ్ జోన్‌లో అవకాశం

అనంతరం జోన్-3 పరిధి ఉషోదయ జంక్షన్ నుంచి రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వరకు కమిషనర్ పర్యటించారు. డ్రోన్ ద్వారా ఆయన పరిశీలించగా వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ అధికంగా కనిపిస్తున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డును ఆక్రమించి కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి దుకాణం తొలగించి, ప్రతి జోన్‌లో ఏర్పాటు చేస్తున్న వెండింగ్ జోన్‌లో వారికి ఒక దుకాణం కేటాయించాలే చూడాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. ఉషోదయ జంక్షన్‌లోని ఫ్రీ లెఫ్ట్‌లో ఆక్రమణలో ఉన్న బడ్డీలు వెంటనే తొలగించి, ఆ చిరు వ్యాపారులకు వెండింగ్ జోన్‌లో అవకాశం కల్పించాలని, కూడలిలో వాహనాల రాకపోకలకు ఫ్రీ లెఫ్ట్‌లో 50 మీటర్ల వరకు ఆక్రమణలు లేకుండా చూడాలని ఆదేశించారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న భవనాల యజమానులు నిర్మాణ సామగ్రిని రోడ్డుపై వేయకుండా చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించాలని జెడ్సీకి సూచించారు. నిత్యం అధికారులు వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు. పర్యటనలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ఒ.బి.ప్రసాదరావు, శానిటరీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

13 నుంచి గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సినేషన్ శిబిరం

మహారాణిపేట: ఆడపిల్లలకు గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ఈ నెల 13 నుంచి 16 వరకు సీతమ్మధారలోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచిత వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహిస్తున్నట్లు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 9 నుంచి 14 ఏళ్ల వయసు లోపు బాలికలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే 600 మంది ఆడపిల్లలు పేర్లు రిజిస్టర్ చేసుకున్నారని, వారంతా నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న శిబిరాన్ని సందర్శించి టీకా వేసుకోవాలని కోరారు. ఇదివరకు మొదటి డోస్ వేసుకొని ఆరు నెలల సమయం గడిచిన వారికి రెండో డోస్ వేసుకునే అవకాశం కల్పిస్తున్నామని డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు, భక్తులు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

- శాస్త్రోక్తంగా గరుడసేవ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తరపూజ చేశారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

నేత్రపర్వంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులందించారు. భక్తులను గరుడవాహనంపై చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువా రం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవ లో పలువురు ఉభయ దాతలు పాల్గొనగా.. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. రూ.1,000 పూజా రుసుం చెల్లించి భక్తులు ఈ పూజలో పాల్గొనవచ్చు. పరోక్ష పద్ధతిలో ఈ పూజ చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో రుసుం చెల్లించవచ్చు.

శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం పరిశీలన



పాఠశాల భవనం పైభాగాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలోని రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల భవనాన్ని కార్పొరేటర్ రాజశేఖర్, ఎంపీ శ్రీభరత్ ముఖ్య కార్యదర్శి ఏఘూరి రాజేశ్ జోన్-5 ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. సుమారు 50 ఏళ్లనాటి ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాలు పడినప్పుడు శ్లాబులు, గోడల నుంచి నీరు కారుతోంది. శ్లాబ్ పెచ్చులూడి పడిపోతుండటంతో భవనం పరిస్థితిని వివరిస్తూ ప్రధానోపాధ్యాయిని ఎం.రాజ్యలక్ష్మి జిల్లా విద్యాశాఖాధికారులకు, విశాఖ ఎంపీ శ్రీ భరత్‌కు, ఎమ్మెల్యే పి.గణబాబుకు, వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు గురువారం పాఠశాలను సందర్శించారు. ఎంపీ నిధులతో పాఠశాలను అభివృద్ధి చేస్తామని, భవనం పునర్నిర్మాణానికి కావలసిన అంచనా విలువను వేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఏఈ ఉషారాణి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పి.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తపు రాట



పూజల్లో పాల్గొన్న శంకరరావు దంపతులు

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల దుర్గాదేవి ఆలయం వద్ద దుర్గా నవరాత్రుల పూజా మహోత్సవాలకు సంబంధించి గురువారం ముహూర్తపు రాట వేశారు. పూజల్లో గాజువాక ఆర్టీసీ డిపో ఎస్ఎంయూ ప్రధాన కార్యదర్శి పిల్లా శంకరరావు దంపతులు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఏటా విజయదుర్గా ఆలయం వద్ద నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా చేస్తున్నామన్నారు. ఈ నెల 22న బాలా త్రిపురసుందరీదేవిగా, 23న గాయత్రీదేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా, 25న కాత్యాయని అవతారంలో అలంకరిస్తామన్నారు. 26న మహాలక్ష్మిగా, 27న లలితా త్రిపుర సుందరీ దేవిగా, 28న మహా చండీదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిస్తారన్నారు. అమ్మవారికి తిరుసేవ ఉత్సవం, పల్లకీ ఉత్సవం, సారె మహోత్సవం, అఖండ జ్యోతి ప్రదర్శన ఉంటాయని పేర్కొన్నారు.

మోహనరావు మాస్టార్‌కు ఆత్మీయ సత్కారం



మోహనరావు మాస్టారిని సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

గోపాలపట్నం: ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన లక్ష్మీనగర్ ఈ బ్లాక్ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు మెట్ట మోహనరావును సహ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మోహనరావు మాస్టారి సేవలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. పాఠశాలను ఈ స్థితికి తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మోహనరావు మాట్లాడుతూ అందరి సహకారం వల్లే తనకు ఈ పురస్కారం దక్కిందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు విలువలు నేర్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చాముండేశ్వరి, వసంత లక్ష్మి, జయలక్ష్మి, మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ మంజూరుపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రామారావు

ఎంవీపీ కాలనీ : జిల్లాలోని పోస్ట్‌మెట్రిక్ స్థాయి విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్ మంజూరుపై జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో జరిగిన సమీక్షలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు పాల్గొని ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించిన కళాశాలల ప్రిన్సిపల్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, సచివాలయాల కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 61 వేల మంది విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు అర్హులన్నారు. వివిధ కారణాల వల్ల సగానికిపైగా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందలేదన్నారు. సచివాలయాల లాగిన్స్, ప్రిన్సిపల్ లాగిన్స్ తోపాటు బయోమెట్రిక్ సమస్యలు కారణంగా ఆయా దశల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వీటిలో సచివాలయాల స్థాయిలో 20 వేలు, ప్రిన్సిపల్స్ స్థాయిలో 3,850, బయోమెట్రిక్, ఇతర సమస్యలతో 11,950 వేల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఆయా దరఖాస్తులను త్వరితగతిన ప్రోసెస్ చేయాలని సూచించారు. అవసరమైన 5 స్టెప్స్ వెరిఫికేషన్స్‌పై మరోసారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.


పట్టుతప్పితే.. ప్రాణాలకే ముప్పే





ఆహ్లాదాన్ని పంచే సుందర సాగర తీరంలో ఒక్కోసారి అతిగా ప్రవర్తించి పట్టు తప్పితే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది. అటువంటి దృశ్యాలే సాక్షి ఫొటోగ్రాఫర్‌కు చిక్కాయి. సహజంగా తీరంలో ఆటుపోట్ల సమయంలో, తుఫాన్లు వచ్చినప్పుడు భారీ రాళ్లు బయటకు కనిపిస్తుంటాయి. తీరం నుంచి కొద్ది దూరం వరకు ఉన్న ఈ భారీ బండరాళ్లు సముద్రం కాస్త వెనక్కి వెళ్లిన సందర్భంలో బయట పడుతుంటాయి. ఆ సమయంలో పర్యాటకులు, నగరవాసులు వీటిపై కూర్చుని ఫొటోలు తీసుకోవడం సర్వసాధారణంగా జరుగుతోంది. అదే సమయంలో నీటిలో నాని ఉండటం వల్ల రాళ్లపై నాచు చేరడంతోపాటు జారుడు స్వభావం కూడా కలిగి ఉంటాయి. చిన్నపాటి పట్టు తప్పినా ప్రమాదానికి గురవ్వాల్సిందే. ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అయినప్పటికీ చాలా మంది నగరవాసులు ఆ రాళ్లపైకి చేరి ఫొటోలు తీసుకుంటున్నారు. కొందరైతే చిన్నారులను సైతం తీసుకుని ప్రమాదకరమైన ఆ రాళ్లపై నడవడం కనిపిస్తోంది. అటువంటి ప్రమాదకర చేష్టలను మానుకోవాలని నగర పోలీసులు సూచిస్తున్నారు.

– ఏయూ క్యాంపస్





ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

పెందుర్తి: ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ కె.సురేష్ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్‌లేని ప్రయాణం ప్రమాదకరం

సింహాచలం: ద్విచక్రవాహనదారులు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ సూరిబాబు తెలిపారు. సింహాచలంలోని గోశాల తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడుపుతున్న వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ సుమారు వందకు పైగా కేసుల్లో హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, సరైన డాక్యుమెంట్లు లేనివే ఎక్కువగా ఉన్నాయన్నారు. చాలా మంది డ్రైవింగ్‌లో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్, డాక్యుమెంట్లు లేకుండా వాహనాలను నడిపేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.